క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన రమేష్‌రెడ్డి


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి బుధవారం నంద్యాల జిల్లా డోన్‌లో కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రి రాజకీయ పరిస్థితులపై వైఎస్ జగన్ ఆరా తీసినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాలని సూచించారన్నారు.

స్కూటీ అపహరణ

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో నివాసముండే ఆర్‌బీ శ్యాం సుందర్‌కు చెందిన స్కూటీని దొంగలు అపహరించారు. వివరాలు.. శ్యాం సుందర్ మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో స్కూటీని ఇంటి ముందు పార్క్ చేశాడు. అనంతరం ఇంటిలోకి వెళ్లి నిద్రించాడు. బుధవారం ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి


స్కాలర్‌షిప్ చెక్కులు అందుకున్న విద్యార్థులు

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ శంకరనందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో బుధవారం రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు లక్ష్మీ, సజియా ఎస్, షహిన, జీ.మౌనిక, సయ్యద్ ఆఫ్రిన్‌కు రూ.5 వేలు చొప్పన చెక్కులను పంపిణీ చేశారు. కరస్పాండెంట్ కేసీ హరి, రాజ్ ఫౌండేషన్ చైర్మన్ గోపాల్‌నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు వాటిని అందజేశారు. రాజ్ ఫౌండేషన్ కార్యదర్శి, కోశాధికారులు శ్రీనివాసులు, రామపుల్లయ్య, సభ్యులు కురుపాటి రాకేష్, డాక్టర్ నటరాజ్, అధ్యాపకులు బసెట్టి క్రిష్ణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జెన్‌కోకు ప్రభుత్వ భూమి అప్పగింత


పత్రాలను అప్పగిస్తున్న తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి

యాడికి: ఏపీ జెన్‌కో సంస్థ కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 255 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించినట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో భూమి పత్రాలను ప్రాజెక్టు అధికారులకు అందజేశారు. 950 మెగా వాట్లతో నిర్మించదలచుకున్న పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ కోసం కుందనకోట గ్రామంలో 179.52 ఎకరాలు, కమలపాడు గ్రామంలో 75.38 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, మండల సర్వేయర్ శేషసాయి, సిబ్బంది, ఏపీ జెన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి హేయం

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్‌పై టీడీపీ నాయకుల దాడి హేయమని బీసీ సెల్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దినేని రంగనాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి బీసీలపై ఎక్కువయ్యాయన్నారు. గత నెలలో జెడ్పీ చైర్ పర్సన్‌పైన దాడికి పాల్పడ్డారన్నారు. బీసీలపై ఇదేవిధంగా దాడులు కొనసాగిస్తే రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రమేష్‌పై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టు అధ్యక్షురాలిగా శంకరమ్మ



తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాడిపత్రి ప్రాజెక్టు అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన శంకరమ్మ ఎన్నికైంది. పట్టణంలో బుధవారం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతలమ్మ, రమాదేవి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అధ్యక్షురాలిగా శంకరమ్మ, కార్యదర్శిగా మహాలక్ష్మి, కోశాధికారిగా భాగ్యలక్ష్మిని ఎన్నికయ్యారు. అలాగే తాడిపత్రి సెక్టార్‌కు గోవిందమ్మ, లక్ష్మీదేవి, అనుపత్రి పాలెం సెక్టార్‌కు హైమావతి, శంకరమ్మను యూనియన్ నేతలుగా ఎన్నుకున్నారు.

ఎరువు.. ధరల దరువు

- భగ్గుమంటున్న ఎరువుల ధరలు
- రైతుల నడ్డివిరుస్తున్న కూటమి ప్రభుత్వం
- ఏడాదిన్నర కాలంలో పలుమార్లు పెరిగిన వైనం
- ఆందోళనలో ఉద్యాన రైతులు


నిల్వ ఉన్న ఎరువులు

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వంలో ఎరువుల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో పంటలు సాగు చేసే రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం, రైతుల బీమాను పట్టించుకోని ప్రభుత్వం పెరుగుతున్న ఎరువుల ధరలను నియంత్రించలేక మరోసారి రైతుల నడ్డి విరుస్తోంది. డిమాండ్ మేరకు యురియా దొరకకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలో ఖరీఫ్‌లో వర్షాధారపు పంటలపై ఆశలు వదులుకున్న అనేకమంది రైతులు నీటి ఆధారిత వాణిజ్య పంటలైన పత్తి, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, దానిమ్మ, చీనీ, కరివేపాకు తదితర వాటి సాగు కోసం రైతులు ఆసక్తి చూపుతున్నారు. తాడిపత్రిలో అరటి 150 ఎకరాలు, బొప్పాయి 25, చీనీ 1130, దానిమ్మ 500, కరివేపాకు 800, నిమ్మ 100, జామ 200, సపోట 300, రేగు 150, అల్లనేరేడు 500 ఎకరాలు సాగు చేశారు. పెద్దపప్పూరు మండలంలో అరటి 2934 ఎకరాలు, బొప్పాయి 50, చీనీ 3579, దానిమ్మ 980, కరివేపాకు 400, నిమ్మ 200, రేగు 300, అల్లనేరేడు 500 ఎకరాలు సాగు చేస్తున్నారు. యాడికిలో చీనీ 1,290 ఎకరాలు, అరటి 1900, నిమ్మ 1800, దానిమ్మ 80 సాగు చేస్తున్నారు. పుట్లూరు అరటి 6,546, దానిమ్మ 1,067, చీనీ 5,016, యల్లనూరులో చీనీ 11,297, అరటి 4,019, దానిమ్మ 1,239 ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఎరువుల కొనుగోలు కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఎరువుల ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం ధరలు పెరుగుతున్నా పట్టించుకోకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిలకడగా ధరలు..

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం హయాం(2019–24)లో ఎరువుల ధరలు నిలకడగా ఉన్నాయి. ఎరువుల ధరలను పెంచిన సందర్భాలు లేవు. వ్యాపారుల నుంచి రైతులను కాపాడేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వంలో పలుమార్లు ఎరువుల ధరలు పెరగడంతో మరోసారి ఎక్కడ ధరలు పెంచుతుందోనన్న భయంతో బడా రైతులు వివిధ మార్గాల ద్వారా పెద్ద ఎత్తున స్టాకు పెట్టుకుంటున్నారు. వీరి స్టాకుతోపాటు రైతులకు కావాల్సిన ఎరువుల కొరత ఉండటంతో చిన్నాచితక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన ఎరువుల ధరలు

ఎరువుల రకం(50కిలోలు)	పాత ధర	కొత్త ధర
15-15-15-15-9	1,450	1,600
12-32-16 (ఇఫ్కో)	1,470	1,720
16-20-0-13	1,250	1,300
16-16-16	1,450	1,600
పొటాష్	1,535	1,800
20-20-0-13(ఫ్యాక్ట్)	1,300	1,425
20-20-0-13 (గ్రోమోర్)	1,300	1,350
20-20-013 (పీపీఎల్)	1,300	1,400
16-20-0-13	1,250	1,300
24-24-0(మహాధన్)	1,700	1,800
14-35-14(గ్రోమోర్)	1,700	1,800
సింగిల్ సూపర్ ఫాస్ఫేట్	580	640
20-20-0-13(మహాధన్)	1,350	1,450

ధరలు తగ్గించాలి



ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలి. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల గోడును ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. పెరిగిన ఎరువుల ధరల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. – చిరంజీవి, సీపీఐ పట్టణ అధ్యక్షుడు

యురియా కొరత తీర్చండి



8 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నా. అరటి కోసం రూ.లక్షల్లో పెట్టుబడి పెడుతున్నా. పంట చేతికి వచ్చి దిగుబడి రావాలంటే ఎరువులను వేయాలి. పంటకు అవసరమైన యురియా దొరకడం లేదు. ధరల పెరుగుదలతో పెట్టుబడి పెరిగిపోతోంది. – రామాంజులరెడ్డి, గంగరాజుకుంట

మోసానికి ప్రతీకగా కూటమి పాలన


చింతలచెరువులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేతలు


గుడిపాడులో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

పెద్దవడుగూరు: కూటమి ప్రభుత్వ పాలన మోసానికి ప్రతీకగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం చింతలచెరువు గ్రామంలో బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను గురించి వివరించారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ సాయంతో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేయడంతోపాటు ప్రస్తుతం ప్రభుత్వ పనితీరును తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎద్దుల శరబారెడ్డి, రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, చింతబరరెడ్డి, శేషారెడ్డి, వెంకటస్వామిగౌడ్, మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, బాస్కర్‌రెడ్డి, శేషగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసం తప్ప అభివృద్ధి ఎక్కడ?

యాడికి: చంద్రబాబు ఏడాదిన్నర పాలనలో మోసం తప్ప అభివృద్ధి ఎక్కడుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మిదేవి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, మండల సీనియర్ నాయకులు బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని కొట్టాలపల్లి, పిన్నేపల్లి, తిప్పారెడ్డిపల్లి, పెద్దపేట, కేశవరాయునిపేట , గుడిపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుడిపాడు సర్పంచు దండు సావిత్రి, నాయకులు దండు రాముడు, చలమారెడ్డి, రామచంద్రుడు, నాగరాజు, కొట్టే వెంకటరామిరెడ్డి, కొట్టే వాసుదేవరెడ్డి, కొట్టే రామచంద్రారెడ్డి, భూమి చంద్రారెడ్డి, కొట్టే మహేశ్వర రెడ్డి, ఆది, రామ్మోహన్, భోగాతి మోపిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శివ, నాగేష్, నాగన్న, గంగరాజు, మారుతి, లక్ష్మినారా యణ, లక్ష్మిరెడ్డి, శేఖర్ రెడ్డి, నారా''న రెడ్డి, రవి శంకర్ రెడ్డి, కొండారెడ్డి, ప్రకాష్ రెడ్డి, యాడికి 19వ వార్డు సభ్యుడు శ్రీరాములు, అగ్గిరాముడు, కంబగిరి రాముడు, వెంకటరాముడుచ రోశన్న, శివకృష్ణ, విజయభాస్కర్ రెడి, కొట్టాలపల్లి ప్రసాద్ రెడ్డి, రామాంజనేయులు రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, అశ్వర్థరెడ్డి, కృష్ణారెడ్డి, అమరేశ్వరరెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, రామాంజులరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, రంగన్న, నబీరసూల్, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలని బాధితుల ధర్నా


మున్సిపల్ కమిషనర్‌తో వాదనకు దిగిన సీపీఎం నాయకులు, కాలనీవాసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 11వ వార్డు మేధా విస్కూల్ లైన్‌లో డ్రైనేజీల్లేని కారణంగా వర్షపునీరు ఇళ్లల్లో చేరి తిండిగింజలు, దుస్తులు పాడయ్యాయని, డ్రైనేజీలు ఏర్పాటు చేయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సి.రమేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారుల వైఖరిని నిరసిస్తూ బుధవారం కాలనీవాసులు మున్సిపల్ ఆఫీసు ఎదుట బైఠాయించారు. కాలనీలో పర్యటించాలని కమిషనర్ నయీమ్‌ను కోరినా అధికారులను పంపుతామని చెప్పడంతో సీపీఎం నాయకులు కమిషనర్ వైఖరిపై మండిపడ్డారు. అనంతరం ఎంఈ ఇంతియాజ్ కాలనీలో పర్యటించగా అక్కడ నెలకొన్న సమస్యలను వారు వివరించారు. కొత్త డ్రైనేజీలు వేయరు..ఉన్న డ్రైనేజీల్లో పూడికతీయకపోతే వర్షపు నీరు ముందుకెలా వెళ్తుందని వారు ప్రశ్నించారు. వీలైనంత త్వరలో పనులు పూర్తిచేయిస్తామని ఎంఈ హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు కసాపురం రమేష్, సురేంద్ర, కాలనీవాసులు చిదంబరం, సయ్యద్‌బాషా, ఇస్మాయిల్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు మరచిన చంద్రబాబు


తాడిపత్రిలో కార్యక్రమం నిర్వహిస్తున్న నేతలు

తాడిపత్రిటౌన్: సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను మరచిపోయి ప్రజలను దగా చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక శ్రీనివాసపురంలోని 31వ వార్డులో బుధవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు రీకాల్ చంద్రబాబు– మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు ఎన్నికల హామీలను గుర్తు చేశారు. కార్యక్రమంలో స్టేట్ సీడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి జిలాన్‌బాషా, జిల్లా కార్యదర్శి పేరం ప్రతాప్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ పేరం ఆదిరెడ్డి, మహిళా నేత ఫరీఫా, చేనేత అధ్యక్షుడు గడ్డం పరమేష్, క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు సునీల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, 35వ వార్డు కౌన్సలర్ రాఘవేంద్రప్రసాద్, నాగభూషణం, వలంటీర్ వింగ్ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కాశీమనోజ్, పట్టణ ఉపాధ్యక్షుడు కేవీ సుబ్బారెడ్డి, కార్యదర్శి మండ్లే సుధీర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభాకర్‌బాబు, మైనార్టీ నాయకుడు షాకీర, నాయకులు హరినాథ్‌రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, రామకృష్ణ, ముస్తఫా, వరుణ్, రబ్బాని, విజయకుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు..

ఫేస్ యాప్‌లో తాడిపత్రికి మొదటిస్థానం

తాడిపత్రి రూరల్: ఫేస్ యాప్‌లో తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు మొదటి స్థానంలో ఉందని సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలోని ఎన్టీఆర్ కల్యాణ మండపంలో బుధవారం ప్రాజెక్టు సమావేశం జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఫేస్ యాప్‌లో మూడో స్థానంలో ఉండటం ప్రాజెక్టుకు గర్వకారణమని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో వారోత్సవాలు నిర్వహించాలన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలపై మానవహారం ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, నాగేశ్వరి, విజయకుమారి, ఉమాదేవి, షంషాద్‌బేగం, వెంకటలక్ష్మి, రామలక్ష్మి, విజయకుమారి, కో–ఆర్డినేటర్ పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: బిడ్డకి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరి అన్నారు. బేతాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ గౌరి బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది లలితమ్మ, రమాదేవి, మంజుల, ఏఎన్ఎం, మహిళ పోలీసు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పామిడి: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ పీడీ నాగమణి అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–1లో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవానికి ఆము హాజరయ్యారు. ఈసందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంతకుముందు ఆమె కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్లు రామలక్ష్మి, లక్ష్మి నారాయణమ్మ, ఎంపీహెచ్‌ఏ శివయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణీలు, బాలింతలు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఎక్కడైనా భూ సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ రాము సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలపై రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకూడదన్నారు. అవకాశమున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ షర్వాణి, ఆర్ఐ వినిత, వీఆర్వోలు మన్మథరెడ్డి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తీజ్ ఉత్సవాలు

గుత్తి రూరల్: చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లో శుక్రవారం నుంచి 16 వరకూ తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు కొర్రా జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు. బంజారాలు, భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఐరిష్‌తోనే హాజరు

యల్లనూరు: ఉపాధి హామీ కూలీలకు ఇప్పటి నుంచి ఐరిష్‌తోనే రెండు పూటలా హాజరు తీసుకోవాలని ఏపీఓ ఓబిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రతి కూలీ రెండు పూటలా హాజరు వేస్తేనే కూలి ఖాతాల్లో జమ చేస్తారన్నారు. అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో పనులు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ సత్యమూర్తి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు

గుత్తి: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నిజామి షాదీఖానాలో బుధవారం సీపీఐ 24వ మండల మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటును అడ్డుకున్న కూటమి నాయకులు ఇపుడు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. గుత్తి మున్సిపాలిటీలో 7000 మంది పేదలు ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. సర్వే పూర్తయినా ఒకరికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీర భద్ర స్వామి, సహాయ కార్యదర్శి రమేష్, పట్టణ, మండల కార్యదర్శులు రాజు, రామదాసు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగలగొడతామన్నారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శిగా రాజు, మండల కార్యదర్శిగా రామదాసు, సహాయ కార్యదర్శిగా మహముదా, నజీర్ మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

చంద్రమోహన్ మృతి తీరనిలోటు


నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి


చంద్రమోహన్ (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ సీనియర్ నేత మడకశిర చంద్రమోహన్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ వింగ్ కోఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి చంద్రమోహన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రమోహన్ మృతి పార్టీకి తీరనిలోటని సాంబశివారెడ్డి పేర్కొన్నారు. అనంతరం మృతుడికుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలాధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సర్పంచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆటవస్తువుల అందజేత


అంగన్‌వాడీ కేంద్రాలకు ఆటవస్తువులను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మస్తాన్‌పేట, బెంచికొట్టాల, కొత్తకొట్టాల్లోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల కోసం ఆ నలుగురు సేవా సమితి సభ్యులు ఆటవస్తువులను అందజేశారు. వన్‌టౌన్ సీఐ మనోహర్ చేతుల మీదుగా ఆటవస్తువులను ఆయా సెంటర్ల ఇన్‌ఛార్జ్‌లకు అందించారు. అలాగే ఓ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ నలుగురు సేవాసమితికి అంగన్‌వాడీ టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, నాయకులు పురుషోత్తం, చక్రీ తదితరులు పాల్గొన్నారు

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

శింగనమల: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. బుధవారం శింగనమలలోని వాసవీకళ్యాణ మండపంలో సీపీఐ నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని చెప్పిన లోకేష్ ఇప్పుడు వాటిని ఎలా ఏర్పాటు చేయిస్తారని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణస్వామి, చిరుతల మల్లికార్జున, నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు రమేష్, పెద్దయ్య, గంగాధర్, బండి రామకృష్ణ, రాముడు, శ్రీనాథచౌదరి, ఆనంద్, హరికృష్ణ, రామాంజినేయులు, రాము, నేసే మధు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి పంట వర్షార్పణం

- రూ.3 లక్షల దాకా నష్టం


కుళ్లిపోయిన ఉల్లిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట తడచిపోయి రైతుకు భారీ నష్టం వాటిల్లింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఎర్రగుడికి చెందిన రైతు ఖాసీం తన మూడెకరాల పొలంలో రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి ఉల్లి పంట సాగు చేశాడు. పంట చేతిక రావడంతో దాదాపు 220 బ్యాగుల్లో గుంతకల్లులోని మార్కెట్ యార్డుకు తరలించి ఆరబెట్టాడు. అయితే మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో పంట మొత్తం తడిచిపోయింది. పంట వద్ద కాపలాగా ఉన్న ఖాసీం, అతడి కుమారుడు శివ మరికొందరు సాయంతో దాదాపు 30 బ్యాగులు వరకూ తడవకుండా కాపాడగలిగారు. ఘటనలో దాదాపు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

సంక్షిప్త సమాచారం

9న రంగనాథుడి కల్యాణం

గుత్తి రూరల్: జక్కలచెరువు గ్రామంలో ఈ నెల 9న బొలికొండ రంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శోభ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రంగనాథ స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా 9వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటలలోపు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడికి కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈఓ కోరారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెద్దపప్పూరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేయబోయే మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల్లో డీజే పెట్టరాదని తెలిపారు. ఎలాంటి ఘటనలు జరిగినా కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని లత లాడ్జ్ వెనుక వున్న టింబర్ డిపోలో పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దాదాపు రూ.40,660 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

యాంటీ కరప్షన్ సంస్థ అధ్యక్షుడిగా మౌలా

గుంతకల్లుటౌన్: పీడీఎస్ఏ యాంటీ కరప్షన్ సంస్థ జాతీయ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎంబీ.మౌలా నియమితులయ్యారు. బుధవారం పాతబస్టాండ్‌లోని టిప్పుసుల్తాన్ ముస్లిమీన్ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సదరు సంస్థ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు రజియా మౌలాను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం మౌలాను టిప్పుసుల్తాన్ కమిటీ నాయకులు సన్మానించారు. దాదాఖలందర్, వలి, ఇమ్రాన్, పఠాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ కొనసాగించాలి

పెద్దపప్పూరు: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ కొనసాగించాలని సంస్థ అభిమానులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ శ్వేతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకపోవడంతో సేవలు అందక నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రెన్యూవల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీటీ అభిమానులు టి.ఆదినారాయణ, చింతా పురుషోత్తం, శింగనగుట్టపల్లి లింగారెడ్డి,జీ.కొత్తపల్లి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

గార్లదిన్నె: సత్యసాయి కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సత్యసాయి కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం ఎంపీడీఓ యోగానందకు వినతి పత్రం అందజేశారు. గత 4నెలలు నుంచి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు నాగభూషణ, బాషా, శ్రీనివాసులు, సాంబశివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం బుక్స్ పంపిణీ

యల్లనూరు: మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అసెస్‌మెంట్ (మూల్యాంకనం) పుస్తకాలను బుధవారం పంపిణీ చేసినట్లు ఎంఈఓ–2 పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలకు 11,742 మంది విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు.